సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ



శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో కోరమాండల్ సంస్థకు చెందిన ఆడిటోరియంలో చిన్నారులకు చిత్రలేఖనంలో ఉచితంగా శిక్షణ ఇచ్చారు. చిత్రకారుడు భాస్కరరావు మాట్లాడుతూ తనకు తెలిసిన విద్య పలువురికి ఉచితంగా అందించాలనే ఆలోచనతో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఇదే విధంగా మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలతో పాటు శ్రీహరిపురంలోని ప్రైవేట్ పాఠశాల చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

18వ రోజుకు చేరిన శ్రావణలక్ష్మి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు ఆదివారం 18వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న భీమిలి పోలీసులు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో శనివారం రాత్రి రోడ్డు దాటుతున్న రిక్క తాత (74)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. భోగాపురం మండలం కొత్త చెరకుపల్లికి చెందిన తాత హైవేలో ఒక దుకాణం వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తుండేవాడు. విధులకు హాజరయ్యేందుకు వచ్చిన తాతను విజయనగరం నుంచి విశాఖవైపు వెళ్లే వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్టు అతని మనమడు తోగులురెడ్డి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వామి

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు. అదేవిధంగా శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విస్తరణ ఎప్పుడు?

- నిత్యం రద్దీగా కొత్తపాలెం ప్రధాన రహదారి
- ఏళ్ల తరబడి ప్రతిపాదనల్లోనే..

గోపాలపట్నం: కొత్తపాలెం–నరవ ప్రధాన రహదారి విస్తరణ కలగా మిగిలిపోయింది. స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి ఆక్రమణలతో కుచించుకుపోవడంతో రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో విపరీతమైన రద్దీ నెలకుంటోంది. 2010లో కొత్తపాలెం జంక్షన్ నుంచి నరవ వెళ్లే రహదారిని కొంత మేరకు 80 అడుగుల రహదారిగా విస్తరించారు. ఆ తరువాత ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా నిలిచిపోయాయి. ఇది ప్రస్తుతం ఆక్రమణలతో 60 అడుగులకు కుదించుకుపోయింది. కొత్తపాలెం జంక్షన్ నుంచి హనుమాన్ కూడలి వరకు విస్తరణ జరగలేదు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. చాలా మంది రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. మరికొంత మంది జీవీఎంసీకి రహదారి స్థలాన్ని దఖలు చేసినా యథాతథంగా నిర్మించేశారు. అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి చెందుతున్న ప్రాంతం

కొత్తపాలెం, నరవ ప్రాంతాలు అభివృద్ధి దిశగా శరవేగంగా పరుగులు తీస్తున్నాయి. బహుళ అంతస్తుల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో నిత్యం భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లొచ్చే విద్యార్థులు, ఉద్యోగులతో ఉదయం, సాయంత్రం వేళ రద్దీగా ఉంటోంది. ఈ క్రమంలో వాహనచోదకులు కొత్తపాలెం కూడలి దాటితే చాలు అన్నట్టు ఎదురు చూస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. రైల్వే అధికారులు కొత్తగా అండర్‌పాస్‌వే పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ రహదారి విస్తరణ పనులు కూడా చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



గతంలో విస్తరించిన కొత్తపాలెం జంక్షన్ నుంచి నరవ వెళ్లే రహదారి



కొత్తపాలెం జంక్షన్ వరకు విస్తరించాల్సిన రోడ్డు

శభాష్ వలంటీర్



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నరసింహంకు పింఛన్ ఇస్తున్న వలంటీర్లు

మల్కాపురం: వలంటీర్ వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడిన వారికి ఈ సేవలు కనువిప్పు కలిగిస్తాయి. యారాడ గ్రామానికి చెందిన నాగోతి నరసింహం అనారోగ్యంతో కేజీహెచ్‌లో కొన్ని రోజుల నుంచి చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్సార్ పింఛన్ కానుక ఇచ్చే క్రమంలో ఈ నెల కూడా ఆ ప్రాంత వలంటీర్స్ రేణుక, వెంకటేష్ ఈ నెల 1వ తేదీన నరసింహం ఇంటికి వెళ్లారు. ఆ ఇంటికి తాళం వేసి ఉండడంతో మరుసటి రోజు కూడా వెళ్లారు. తాళం వేసి ఉండడంతో ఆయన ఆస్పత్రిలో ఉన్నారని తెలుసుకుని ఆదివారం వారిద్దరూ కేజీహెచ్‌కు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న నరసింహంకు పింఛన్ అందజేశారు. యారాడ గ్రామం నుంచి వలంటీర్లు సొంత ఖర్చులతో కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ ఇవ్వడంతో వారిని పలువురు అభినందించారు.

షిప్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్‌కు సమస్యను వివరిస్తున్ననాయకులు

సింధియా: విశాఖ పర్యటనలో భాగంగా ఆదివారం విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేసిన కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్‌శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌ను షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్న షిప్‌యార్డ్ ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగుల వెంటనే పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను తెలుసుకున్న కేంద్ర మంత్రి సోనోవాల్, ఎంపీ జీవీఎల్ నరసింహారావు షిప్‌యార్డ్ కార్మికుల సమస్యలపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తింపు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు



లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. చాతుర్మాస దీక్షలో ఉన్న కుర్తాళ, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. జూలై 3 నుంచి సెప్టెంబర్ 29 వరకు చాతుర్మాస దీక్షలు చేపట్టడంతో స్వామీజీ లలితా పీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులను దర్బారు హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతించారు. పలువురు భక్తులు తమ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు మంత్రోపదేశం తీసుకున్నారు. మధ్యాహ్నం పీఠంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. లలితా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఉపశ్లోకుడే శ్రీకృష్ణుడి మొదటి సంతానం

శ్రీకృష్ణుడికి ప్రద్యుమ్నుడు కంటే ముందే సంతానం ఉందని లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితా పీఠంలో జరుగుతున్న శ్రీకృష్ణ కథా సప్తాహంలో మూడో రోజు శ్రీకృష్ణుడి గురించి ఆసక్తికరమైన విషయాలను ప్రవచించారు.

ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణుడి పుత్రుడిగా అందరికీ తెలిసిన వాడని, అతడి కంటే ముందే మగ సంతానం ఉందన్నారు. కంస సంహారం కోసం శ్రీకృష్ణ, బలరాములు మధురలో ప్రవేశిస్తున్నపుడు.. కంసుడికి సుగంధ ద్రవ్యాలు అందజేసే అంధవికారమైన కుబ్జ నుంచి వాటిని స్వీకరించి ఆమె రూపాన్ని సుందరంగా మార్చాడని తెలిపారు. శ్రీకృష్ణుడికి పెళ్లికి ముందే కుబ్జతో మగ సంతానం కలిగిందన్నారు. ఆ కుమారుడి పేరు ఉపశ్లోకుడని, అతడు శ్రీకృష్ణుడికి మహా భక్తుడని స్వామి పేర్కొన్నారు. అనంతరం శ్రీకృష్ణుడు, రాధాదేవి అవతరణ విషయాలను ప్రవచించారు.

ఎర్నిమాంబకు కుంకుమ పూజలు

కంచరపాలెం : జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, మంగళగౌరీ వ్రతాలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక దర్శనాలు కూడా ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

‘సామాజిక నిత్య హితోక్తులు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు, సాహితీవేత్తలు

సీతంపేట: తెలుగు భాషకు గౌరవం, ఆదరణ పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కళావేదిక వ్యవస్థాపకుడు, డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన ‘సామాజిక నిత్య హితోక్తులు 2’ అనే పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగు భాషకు, సాహిత్యానికి ఆదరణ, గౌరవం తగ్గిందని, ప్రభుత్వాలకే కాదు యువతలోనూ లోపించిందన్నారు. తెలుగు భాష దండగ అనే భావన పిల్లల్లోనే కాదు, తల్లిదండ్రుల్లోనూ ఎక్కువగా కనిపిస్తోందని చెప్పారు. ఇంగ్లిష్ నేర్చుకుంటే ఉపయోగం అన్న భావన ప్రస్తుత తరంలో బాగా పెరిగిందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన సూచనగా ప్రతి ఒక్కరూ పరిగణించాలన్నారు. ఇలాగే కొనసాగితే వందేళ్లలో తెలుగు భాష పూర్తిగా ప్రమాదంలో పడుతుందన్నారు. తెలుగు భాషను కాపాడుదాం అన్న ఆలోచనతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సాహితీ వేత్తలు, సంఘాలు పెద్ద ఎత్తున పూనుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు భాష పరిరక్షణకు తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తొలి ప్రతిని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు ఎ.హెచ్.ఎన్.వెంకటరావుకు అందజేశారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ఆచార్య కోలవెన్ను విఠల్ మూర్తి, ఆచార్య జె.అప్పారావు, మల్లాది సోమేశ్వరశర్మ పాల్గొన్నారు.

అయ్యప్ప మహా సంగమ పూజ విజయవంతం చేయండి

తగరపువలస: నగరంలో నవంబర్ 24 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే అయ్యప్ప మహా సంగమ పూజను భక్తులంతా జయప్రదం చేయాలని అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు పైల ఆదిమోహన్ రెడ్డి కోరారు. ఎంఎఫ్‌సీ యోగా సెంటర్‌లో భీమిలి నియోజకవర్గ గురుస్వాములతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. దక్షిణ భారతదేశంలో మొదటిసారిగా విశాఖలో జరగనున్న ఈ పూజా కార్యక్రమాల విశేషాలను వివరించారు. శబరిమలైలోని ప్రధాన తంత్రి, 12 మంది నంబూద్రిలు, మేల్ శాంతులతోపాటు పందలరాజు వంశీయులు విలక్కు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ గాయకుడు వీరమణిరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప భజన గీతాలు ఆలపిస్తారన్నారు. ఈ పూజలో ప్రతి ఒక్కరు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగార్జున, ఫణీంద్రస్వామి, కృష్ణయ్య స్వామి, రాజేష్, గురుస్వాములు ఆదిమూలం నాగరాజు, గాడు తాతినాయుడు, మాల్యాద్రి, కదిరి జగన్నాథం, నీలాపు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం



ర్యాలీగా వస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార : నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగ కల్పనకు ఐక్యంగా ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో సరస్వతీ పార్కు నుంచి డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా లలితా జ్యూయలరీ వరకు నిరుద్యోగ యువతీ, యువకులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు యూఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలకు ఎసర పెడున్నారని మండిపడ్డారు.

సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలున్నప్పటికీ పర్మినెంట్ ఉద్యోగాలు తీయకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ వంటి ఉద్యోగాలు ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులకు లాభాలు చేకూరుస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు యువత ఉద్యోమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.సంతోష్, ఐద్వా రాష్ట్ర నాయకులు బి.పద్మ, డాక్టర్ జి.ప్రియాంక, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యు.రాజు, ఎల్.జి. నాయుడు, గణేష్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు.

స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి,శ్రీదేవి,భూదేవిలని వేదికపై అధిష్ఠంపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు .అనంతరం 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: ఈ నెల 7వ తేదీన శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మల్కాపురంలో శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో వచ్చే గురువారం నుంచి శనివారం వరకు (మూడు రోజుల పాటు) వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యవర్గ ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్సీ వంశీకృష్ణశ్రీనివాస్‌యాదవ్‌తో పాటు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, యాదవ సామాజిక వర్గాని చెందిన పలు వార్డుల కార్పొరేటర్లను ఉత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు, సలహాదారులు పాల్గొన్నారు.

దళిత సేన నిరసన



నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు, మహిళలు

కంచరపాలెం: మహిళలపై జరుగుతున్న అకృత్యాల విషయంలో సత్వర స్పందన, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకువాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కోరారు. రాజస్థాన్‌లో ఒక అభాగ్యురాలిపై జరిగిన రాక్షస ఘటనపై దళిత సేన తీవ్రంగా ఖండించింది. కంచరపాలెంలోని కార్యాలయం వద్ద దళిత సేన ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ ప్రతాప్‌గాడ్ జిల్లాలో గిరిజన తెగకు చెందిన మహిళపై భర్తతోపాటు కొందరు దారుణ ఘటనకు పాల్పడటం యావత్ దేశానికే సిగ్గుచేటన్నారు. వివాహేతర సంబంధం అనుమానంతో ఆమెను వివస్త్రను చేసి గ్రామస్తులందరూ చూస్తుండగా బహిరంగంగా ఊరేగించడం అవమానకరమన్నారు. మహిళను పూజించే భారతదేశంలో ఇటువంటి సంఘటనలు, అత్యాచారాలు, అవమానాలు జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని గొల్లమాల అప్పారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి చింతల మల్లికార్జునరావు, కోశాధికారి లంకా రామారావు, నగర కన్వీనర్ గొల్లమాల మీన, కార్యదర్శి పట్నాల ఝాన్సీ, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత

అక్కిరెడ్డిపాలెం: రహదారి భద్రత.. అందరి బాధ్యతని, రోడ్డు ప్రమాదాలకు గురయ్యే కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకునేలా ప్రతీ ఒక్కరిలో అవగాహన పెంచుకోవాలని గాజువాక సీఐ లంకా భాస్కరరావు అన్నారు. ఉత్తరాంధ్ర ట్రక్ ఓనర్స్ అండ్ సప్లయర్స్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గాజువాక శ్రీనగర్‌లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ ప్రమాదాలను అరికట్టడం ఏఒక్కరి వల్లో సాధ్యం కాదని, దీనిపై ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, ఎం.జానకీరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని గాజువాకలో ట్రక్ టెర్మినల్ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనేక పరిశ్రమలు, వాణిజ్య సంస్థలతో ముడిపడి ఉన్న గాజువాకలో భారీ వాహనాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. ప్రమాదాల నియంత్రణకు తమ వంతు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ట్రక్ టెర్మినల్ ప్రతిపాదనను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, అరవింద్ కుమార్ మిశ్రా, మిట్టల్ అగర్వాల్, పి.జె.ఆర్.ఎస్.మహారథి తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా ప్రమాదకర వ్యాధి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జీఆర్‌రెడ్డి

సింహాచలం: గ్లకోమా అనేది కంటి దృష్టిని నిశ్శబ్దంగా హరించే ప్రమాదకరమైన వ్యాధి అని ఏపీ ఆప్తాల్మిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ రెడ్డి తెలిపారు. విశాఖ ఆప్తాల్మిక్ అసోసియేషన్– గ్లకోమా సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గ్లకోమా ఇండియా ఎడ్యుకేషన్ ప్రోగ్రాం సదస్సు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రెడ్డి మాట్లాడుతూ కంటిలో ఏమాత్రం అనారోగ్యం సోకినా వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ కంటిలో అధిక పీడనం ఏర్పడడం వల్ల గ్లకోమా వ్యాధి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి విజయకుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, చెన్నైలోని ప్రీమియర్ ఐ కేర్ సర్జికల్ సెంటర్ డాక్టర్ ఎస్ఆర్ రంగరాజ్, ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ మల్లీశ్వరి,డాక్టర్ కేవీవీ సత్యనారాయణ, డాక్టర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి




ఫోర్త్ టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా జీవించాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్. విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కొత్త సీఐగా బాధ్యతలు స్వీకరించి వారం రోజులు కావడంతో ప్రతి ఒక్క రౌడీషీటర్‌ను ఆయన విచారించి, పలు వివరాలు, వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఏఎస్ఐ డి.వి.రత్నం కౌన్సెలింగ్ నిర్వహించారు. గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల దినచర్యపై ఆరా తీశారు. హద్దు మీరి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ హెచ్చరించారు.

ఘనంగా వాసవీ వీక్



సమావేశంలో పాల్గొన్న వాసవీ క్లబ్ అల్లిపురం ప్రతినిధులు

అల్లిపురం : వాసవీ ఇంటర్నేషనల్ వ్యస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా జయంతి సందర్భంగా వాసవీ క్లబ్ అల్లిపురం ఆధ్వర్యంలో వాసవీ వీక్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అల్లిపురం శాఖ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ మేరకు అల్లిపురం సౌత్ జైలురోడ్డులో గల క్లబ్ ఆవరణలో ఆదివారం సభ్యులు సమావేశమయ్యారు. వారం రోజుల కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు 1వ తేదీన దాతలకు సన్మానం, రెండవ రోజు మాతృవందనం కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను పూజించడం, మూడవరోజు వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు అల్పాహారం అందించడం జరిగాయన్నారు. ఇక నాల్గవ రోజు విద్యార్థులకు మోటివేషన్ కోచింగ్, ఐదవ రోజు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్లకు సత్కారం, ఆరవ రోజు పాత్రికేయ దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు సత్కారం, 7వ రోజు ప్రత్యేక తరగతి విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం చేపట్టేందుకు తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్లబ్ కార్యదర్శి బీవీఎల్ కుమార్, కోశాధికారి పీవీఎస్ఆర్ గుప్తా, రీజనల్ చైర్‌పర్సన్ వరిగల పండు, ప్రోగ్రాం చైర్మన్ వంకాయల విక్రమ్, ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, బోర్డు సభ్యులు పెన్నం రత్నాజీరావు, డీవీఆర్ గుప్తా, ఎం.భద్రం, కేఆర్ నాగేశ్వరరావు, వంకాయల రవి తదితరులు పాల్గొన్నారు.